సాక్షి మెదక్

మంగళవారం । 30 । జనవరి । 2024



రోబో కనువిందు

సిద్దిపేటలో ఏర్పాటు చేసిన రోబో 2.0 ఫ్యామిలీ రెస్టారెంట్‌లో రెండు రోబోలు ఫుడ్ ఆర్డర్ తీసుకుంటున్నాయి. వివరాలు 8లో ▸



'కుష్ఠు'ను నయం చేయొచ్చు

కుష్ఠు బాధితుల పట్ల వివక్ష చూపొద్దని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్ బాబు తెలిపారు. వివరాలు 8లో ▸



సర్పంచ్‌ల సేవలు అమోఘం

గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు చేసిన సేవలు అమోఘమని ఎంపీపీలు కొనియాడారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఎన్‌డీఎస్‌ఎల్ ఫ్యాక్టరీలు తెరిచేందుకు కార్యాచరణ

మంత్రి శ్రీధర్ బాబు చైర్మన్‌గా త్వరలో కమిటీ: ఎమ్మెల్యే రోహిత్

మెదక్: తెలంగాణలోని మెదక్ జిల్లా మంబోజిపల్లి, నిజామాబాద్ జిల్లాలోని శక్కర్‌నగర్, జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి నందు గల ఎన్‌డీఎస్‌ఎల్ ఫ్యాక్టరీలను తెరిపించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తాము అధికారంలో కొస్తే మంభోజిపల్లి ఎన్డీఎస్‌ఎల్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ప్రజలకు, కార్మికులకు హామీనిచ్చారు. సోమవారం ఈ విషయంపై ఆయన సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించగా రాష్ట్రంలోని ఎన్‌డీఎస్‌ఎల్ యూనిట్లను తెరిపించేందుకు కమిటీ వేయనున్నట్లు హామీనిచ్చినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కమిటీ చైర్మన్‌గా మంత్రి శ్రీధర్‌బాబు, కమిటీ సభ్యులుగా మంత్రి దామోదర్ రాజనర్సింహ, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితోపాటు మరి కొందరు సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులు, కార్మికులతో మాట్లాడి ప్రభుత్వానికి నివేదికను అందజేయనున్నట్లు తెలిపారు.

విద్యా సదస్సుకు తరలిరండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

నర్సాపూర్ రూరల్: మెదక్‌లో ఫిబ్రవరి 4న నిర్వహిస్తున్న విద్యా సదస్సుకు తరలిరావాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంగయ్య, వెంకట్ రామ్‌రెడ్డి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని పాఠశాలలను సందర్శించి వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా ఉపాధ్యాయులు అనేక సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారన్నారు. సదస్సులో వాటి పరిష్కారమై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఎమ్మెల్సీ కోదండ రామ్, టీపీటీఎఫ్ మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, వేణుగోపాల్ పాల్గొంటారన్నారు. అలాగే అదే నెల 11, 12వ తేదీల్లో ద్వితీయ విద్యవైజ్ఞానిక మహాసభలను సైతం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యఅతిథులుగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క తదితరులు పాల్గొంటారన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో కమిటీ కన్వీనర్ యాదగిరి, ఉపాధ్యాయ దర్శిని ఎడిటర్ శశిధర్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ జాదవ్, నాగభూషణం, నాయకులు శివకుమార్, రాంసింగ్, సుందర్‌రాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గొల్ల కురుమలను ముంచిన బీఆర్‌ఎస్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గొల్ల కురుమలు

మెదక్: గొల్ల కురుమలను ధనవంతులను చేస్తానని ఆశ చూపి కేసీఆర్ డీడీలు కట్టించుకుని గొర్రెలను ఇవ్వకుండా నిండా ముంచాడని అఖిల భారత యాదవ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళీయాదవ్ మండిపడ్డారు. సోమవారం వారితో కలిసి ఆయన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొంతమందికి మాత్రమే గొర్రెలిచ్చి, మిగతా వారితో డీడీలు కట్టించుకుని కూడా ఇవ్వలేదన్నారు. ఇచ్చినవి నాణ్యతగా లేవన్నారు. ఈ స్కీంలో భారీ కుంభకోణం జరిగిందన్నారు. వెంటనే సీబీసీతో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా చొరవ తీసుకొని వెంటనే జీవాలను పంపిణీ చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశం, పలు గ్రామాలకు చెందిన గొల్ల కురుమలు పాల్గొన్నారు.

బహిరంగ వేలం

మెదక్ కలెక్టరేట్: నర్సాపూర్ మండలానికి చెందిన పైడి శ్రీధర్ గుప్తా రెవెన్యూ బకాయిలు గడువులోపు చెల్లించలేకపోవడంతో అతని చరాస్తులు ఫిబ్రవరి 13న వేలం వేయనున్నట్లు కలెక్టర్ రాజర్షిషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం రూ.47 కోట్ల 17 లక్షల 36 వేల 860లు బకాయి ఉన్నాడని తెలిపారు. ఆరోజు ఉదయం 11 గంటలకు నర్సాపూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు తెలిపారు. అలాగే స్థిరాస్తులను కూడా అదే నెల 27న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేస్తున్నట్లు తెలిపారు.

'మిడ్డే'లో గుడ్డు మాయం!



- బిల్లులు రాకపోవడంతో ఆపేసిన నిర్వాహకులు
- ఇళ్ల నుంచి అల్పాహారం తెచ్చుకుంటున్న విద్యార్థులు

మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారమైన కోడిగుడ్డు ఇవ్వడం లేదు. నెలల తరబడి బిల్లులు పెండింగ్ ఉండటంతో నిర్వాహకులు ఆపేసినట్లు తెలిసింది. వారానికి మూడు రోజులు ఇవ్వాల్సిఉండగా అమలు కావడం లేదు. బహిరంగ మార్కెట్లో గుడ్డు ధర పెరగడం అందుకు తగినట్లు బడ్జెట్ ఇవ్వలేదని తెలుస్తోంది. ఇప్పటికే అప్పుల్లో మునిగిపోయామని తమ వల్ల కాదని వారు చేతులెత్తేశారు. కొన్ని పాఠశాలల్లో భోజనం సరిగ్గా లేదని విద్యార్థులు ఇళ్ల నుంచి తెచ్చుకొని తింటున్నారు. అయితే సాక్షి విజిట్‌లో ఈ అంశాలు వెలుగుచూశాయి.

సాక్షి విజిట్

మెదక్: జిల్లాలో 897 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. 1 నుంచి 10వ తరగతి వరకు 84,445 మంది విద్యార్థులు చదువుతున్నారు. 592 పాఠశాలలకు ఏజెన్సీల నిర్వాహకులు, 305 పాఠశాలలకు అక్షయ పాత్ర ద్వారా భోజనం సరఫరా చేస్తారు. కానీ 90 శాతం పాఠశాలల్లో మెనూ అమలు చేయడం లేదు. వారంలో 3 రోజులపాటు గుడ్డు ఇవ్వడం లేదు. అక్షయ పాత్ర ద్వారా భోజనం అందించే పాఠశాలల్లో విద్యార్థులు మాత్రం ఇళ్ల నుంచి తెచ్చుకుంటున్నారు.

అక్షయ పాత్ర ద్వారా..

నార్సింగ్ మండలకేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 452 మంది విద్యార్థులు చదువుతున్నారు. కొంతకాలంగా అక్షయ పాత్ర ద్వారా మధ్యాహ్న భోజనాన్ని సరఫరా చేస్తోంది. కానీ పౌష్టికాహారమైన పండ్లు, గుడ్లు ఇవ్వడం లేదు. విద్యార్థులు సగానికి పైగా ఇళ్ల నుంచే టిఫిన్ బాక్సులు తెస్తున్నారు. భోజనం రుచిగా ఉండటం లేదని వారు ఆవేదన చెందుతున్నారు. గతంలో గుడ్డుకు బదులు పండ్లు ఇచ్చేవారని ప్రస్తుతం అవి కూడా ఇవ్వటం లేదన్నారు.

నిదర్శనం..

- మెదక్ మండలంలోని మక్తభూపతిపూర్ ఉన్నత పాఠశాలలో 420 మంది విద్యార్థులు ఉన్నారు. మెనూ ప్రకారం సోమవారం గుడ్డు ఇవ్వడం లేదు. నాలుగు నెలల నుంచి నిర్వాహకులకు బిల్లులు, కార్మికులకు జీతాలు రావటం లేదు. ఇప్పటికే రూ. 2 లక్షలు అప్పులు చేశామని ఇక తమ వల్ల కాదని వారన్నారు.
- అల్లాదుర్గ్ మండలంలో గల ప్రాథమిక పాఠశాలలో 57 మంది విద్యార్థులున్నారు. మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం టిఫిన్ సైతం పెడుతున్నారు. 2 నెలల నుంచి వేతనాలతో పాటు భోజన, టిఫిన్ బిల్లులు సైతం రాకపోవటంతో నిర్వాహకులు సోమవారం గుడ్డు ఇవ్వడం లేదు.
- కొడిపల్లి మండలంలోని ప్రాథమిక పాఠశాలలో 180 మంది విద్యార్థులున్నారు. 4 నెలలుగా నిర్వాహకులకు బిల్లులు రావడం లేదు. 3 నెలల నుంచి కార్మికులకు జీతాలు రావటం లేదని మెనూ పాటించటం లేదని తెలుస్తోంది. సోమవారం రోజు గుడ్డు అందించడం లేదు.



మక్తభూపతిపూర్ పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు



నార్సింగ్ మండల కేంద్రంలోని పాఠశాలలో ఇళ్ల నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న విద్యార్థినులు

- కొల్చారం మండలం.. రంగంపేట ఉన్నత పాఠశాలలో 400 మంది పైచిలుకు విద్యార్థులున్నారు. నాలుగు నెలల నుంచి కార్మికులకు వేతనాలు, బిల్లులు రావటం లేదని గుడ్డు ఇవ్వడం ఆపేశారు.
- చేగుంటలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో 75 మంది విద్యార్థినులు చదువుతున్నారు. నెలల తరబడి బిల్లులు, వేతనాలు రాకపోవటంతో భోజనంలోకి గుడ్డు సరఫరా చేయడం లేదు.

మెనూ..

సోమవారం:	అన్నం కిచిడి, మిశ్రమ కూరగాయలతో వండిన కూర, గుడ్డు,
మంగళవారం:	అన్నం, సాంబారు, మిశ్రమ కూరగాయలతో కూర,
బుధవారం:	అన్నం ఆకుకూర, పప్పు, మిశ్రమ కూరగాయలతో కూర, గుడ్డు
గురువారం:	శాఖాహారం బిర్యానీ, మిశ్రమ కూరగాయలతో కూర,
శుక్రవారం:	అన్నం సాంబారు, మిశ్రమ కూరగాయల కూర, గుడ్డు
శనివారం:	అన్నం ఆకుకూర, పప్పు, మిశ్రమ కూరగాయల కూర

అప్పులు చేసి వండి పెడుతున్నాం



నెలల తరబడి మధ్యాహ్న భోజన బిల్లులు రావటం లేదు. అప్పులు చేసి మరి వండి పెడుతున్నాం. బయట మార్కెట్లో కోడి గుడ్డు ధర రూ.7ల వరకు ఉంది. ప్రభుత్వం మాకు రూ. 5లే ఇస్తుంది. నెలనెలా బిల్లులతో పాటు వేతనాలివ్వాలి. పెరిగిన ధరలకనుగుణంగా రేట్లు పెంచాలి
– విమల వంట నిర్వాహకురాలు, మక్తభూపతిపూర్

రెండు రోజుల్లో బిల్లులు చెల్లిస్తాం

1 నుంచి 8వ తరగతి వరకు జనవరి నెల వరకు బిల్లులొచ్చాయి. 9–10వ తరగతుల విద్యార్థులకు సంబంధించి మార్చి వరకు బిల్లులతో పాటు వేతనాలొచ్చాయి. రెండు రోజుల్లో పంపిణీ చేస్తాం. మధ్యాహ్న భోజనంలో వారానికి 3 రోజుల పాటు గుడ్డు పెట్టాల్సి ఉంది. కొన్ని పాఠశాలల్లో ఏజెన్సీ వాళ్లు ముందుకు రాక పోవటంతోనే అక్షయ పాత్ర ద్వారా భోజనం సరఫరా చేస్తున్నాం. – రాధాకిషన్, డీఈఓ

1 నుంచి ప్రాక్టికల్ ఎగ్జామ్స్

ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి సత్యనారాయణ



మెదక్: ఫిబ్రవరి 1 నుంచి 15వ తేదీ వరకు 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు మూడు విడతలుగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాకేంద్రంలో అందుకు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. సైన్స్ గ్రూపులకు సంబంధించిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 3,594 మంది, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి ప్రథమ సంవత్సరంలో 602 మంది, ద్వితీయ సంవత్సరంలో 528 మంది పరీక్షలు రాయనున్నారన్నారు. జనరల్, ఒకేషనల్ గ్రూపులు రెండు కలిపి 35 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశామన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అరగంట ముందుగా కేంద్రాలకు వారు చేరుకోవాలన్నారు. హాల్ టిక్కెట్లను కళాశాలలో పొందాలన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రథమ సంవత్సరం వారికి ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తున్నామన్నారు. గత సంవత్సరం ఫస్టియర్‌లో నైతికత– మానవ విలువలనే పరీక్షలో పలువురు విద్యార్థులకు ఫెయిల్ అయ్యారన్నారు. వారికి ఈనెల 17న మరోసారి నిర్వహిస్తున్నామన్నారు. ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ కోసం నియామకమైన హైపర్ కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారన్నారు. ఎస్పీ /పోలీస్ కమిషనర్, ఇంటర్ ఆర్‌జేడీ, జిల్లా ఇంటర్ విద్యాధికారి సభ్యులుగా ఉంటారన్నారు. అదనంగా డీసీ మెంబర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తుంటాయని స్పష్టంచేశారు. కాగా కేంద్రాల వారీగా అధికారులను కూడా నియమిస్తామన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ఎస్పీ బాలస్వామి

పెద్ద శంకరంపేట(మెదక్): విద్యతోనే ప్రతి ఒక్కరికీ ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎస్పీ బాలస్వామి అన్నారు. సోమవారం మండలకేంద్రంలో క్యూబ్ రూట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 54 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ పది వేల రూపాయల చొప్పున ఉపకార వేతనం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య అనేది వికాసాన్ని అందిస్తోందన్నారు. మన సంపాదనను ఎవరైనా దోచేసే అవకాశం ఉంది కానీ విద్యను మాత్రం ఎవరూ దోచుకోలేరన్నారు.అన్ని దానాల్లో కన్నా విద్యా దానం గొప్పదని పేర్కొన్నారు. నవ సమాజ నిర్మాణం కోసం ఎంతగానో తోడ్పాటు అందిస్తుందన్నారు. క్యూబ్ రూట్స్ ఫౌండేషన్ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకొని మౌలిక సదుపాయాలు కల్పించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే ఇలాంటి సంస్థలు మరిన్ని సేవారంగంలోకి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రూట్స్ ఫౌండేషన్ సీఎస్ఆర్ అనూజ్ మైత్రి, మెదక్ డీఎస్పీ ఫణి కుమార్, సయ్యద్ అహ్మద్ షేక్, ఆర్ఈఎంఎస్‌వీ ఎండీ రెహమాన్ ఖాన్, ప్రాజెక్టు హెడ్ ప్రభాకర్ రెడ్డి, ఐఎంఎస్ మేనేజర్ ఖాజా మొహినుద్దీన్, పెద్దశంకరంపేట ఎస్ఐ బాలరాజ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్ పత్రాన్ని అందజేస్తున్న బాలస్వామి

ఎంపీ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ కనుమరుగు

- పీసీసీ ఉపాధ్యక్షుడు రాములు నాయక్
- పదేళ్లలో అభివృద్ధి చెందినవి సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్ల మాత్రమేనని వ్యాఖ్య

మెదక్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల తరువాత తెలంగాణలో టీడీపీలాగే బీఆర్‌ఎస్ కూడా కనుమరుగవటం ఖాయమని పీసీసీ ఉపాధ్యక్షుడు రాములునాయక్ జోస్యం చెప్పారు. రాష్ట్రంలో గడిచిన పదేళ్లలో అభివృద్ధి చెందినవి సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్ల మాత్రమేనన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఘోర ఓటమి పాలైనా.. బావ, బామ్మర్దులు ఇంకా అధికారంలో ఉన్నట్లుగా భావించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. పదేళ్ల వారి పాలనలో ఎప్పుడూ కార్యకర్తలను పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సెక్రటేరియట్‌లో సీఎం నేరుగా ప్రజలతో మాట్లాడటం గర్వించదగ్గ విషయమన్నారు. కేవలం 50 రోజుల పాలన కూడా గడవకముందే హామీలను ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రానికి దళితుడే మొదటి సీఎం అని, దళితులకు మూడెకరాలు, కేజీ టూ జీపీ విద్య, నిరుద్యోగ భృతి అంటూ కేసీఆర్ ఎన్నో హామీలిచ్చి విస్మరించారన్నారు. ఉద్యమకారులను సైతం పట్టించుకోలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి ప్రజలు ఆయనకు సరైన గుణపాఠం చెప్పారన్నారు. ఇప్పుడు తమ పార్టీ ఒక్కో ఉద్యమకారుడికి 250 గజాల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు ఘన విజయంతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజుద్దీన్, సురేందర్‌గౌడ్ ఉన్నారు.



మాట్లాడుతున్న రాములు నాయక్

మధ్యాహ్నం మూడింటికే బడుల బంద్!

నార్సింగిలో వెలుగు చూసిన ఉదంతాలు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని రెండు ప్రభుత్వ పాఠశాలలు మధ్యాహ్నానికే తాళం వేశారు. విషయానికొస్తే.. సోమవారం నార్సింగి మండలం జప్తిశివనూర్ కాశ్యతండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులను మధ్యాహ్నం 3 గంటలకు బయటికి పంపించేసి ఉపాధ్యాయుడు తాళం వేసి వెళ్లిపోయాడు. అలాగే ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలకు కూడా తాళం వేసి ఉపాధ్యాయురాలు ఇంటి వెళ్లి పోయిందని గ్రామస్తులు తెలిపారు. దీనిపై కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. ఉపాధ్యాయులు పాఠశాలలకు తాళాలు వేసి వెళ్లిన విషయం తమ దృష్టికి రాలేదన్నారు. విచారించి చర్యలు తీసుకుంటానన్నారు.



నార్సింగి మండలం జప్తిశివనూర్ కాశ్యతండాలో తాళం వేసిన పాఠశాల ఇదే

మున్సిపల్ చైర్మన్‌గా అశోక్‌గౌడ్

ఏకగ్రీవంగా ఎన్నుకున్న కౌన్సిలర్లు

- హాజరైన ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎమ్మెల్సీలు వెంకట్రాంరెడ్డి, యాదవరెడ్డి

నర్సాపూర్ రూరల్: మున్సిపల్ చైర్మన్‌గా దుర్గప్పగారి అశోక్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఎన్నికల అధికారి, తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభించారు. 15 మంది కౌన్సిలర్లు, ఎమ్మెల్యే, ఇద్దరు ఎమ్మెల్సీలు కలిపి మొత్తం 18 మంది హాజరు కావాల్సి ఉంది. అయితే బీఆర్ఎస్ తరఫున 9 మంది కౌన్సిలర్లు అశోక్ గౌడ్, పంబల రామచందర్, సునీత బాల్‌రెడ్డి, లలితాభిక్షపతి, చేర్యేటి లక్ష్మీనగేష్, సరిత ఆంజనేయులు గౌడ్, గొల్ల రుక్కమ్మ, ఎమ్మెల్సీలు వెంకట్రాంరెడ్డి, యాదవరెడ్డిలు హాజరయ్యారు. బీజేపీ కౌన్సిలర్లు మాత్రం గైర్హాజరయ్యారు. కాగా మున్సిపల్ చైర్మన్‌గా అశోక్‌గౌడ్‌ను 8వ వార్డు సభ్యుడు పంబల రామచందర్ ప్రతిపాదిస్తే 14వ వార్డు కౌన్సిలర్ తంగేడిపల్లి సరిత బలపరచగా మిగతా సభ్యులు కూడా ఆమోదించారు. ఆవెంటనే ఎన్నికల అధికారి ఆయనతో ప్రమాణాన్ని చేయించి నియామక పత్రాన్ని అందజేశారు.



అశోక్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, కౌన్సిలర్లు

అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం: సునీతారెడ్డి, ఎమ్మెల్యే

నూతన చైర్మన్ అశోక్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌గా గెలిచి మున్సి పల్ చైర్మన్‌గా నాలుగేళ్ల పాటు పదవిలో ఉన్న మురళీధర్‌యాదవ్ బీజేపీలో చేరారన్నారు. దీంతో అవిశ్వాసం తప్పనిసరైందన్నారు. కొత్త మున్సిపల్ పా లకవర్గం పట్టణ అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు.

పనులకు ప్రాధాన్యం: అశోక్‌గౌడ్, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్

మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ మాట్లాడుతూ, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, కౌన్సిలర్ల సహకారంతో పట్టణాన్ని ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నర్సాపూర్ మున్సిపల్ అభివృద్ధికి రూ. 65 కోట్లు మంజూరయ్యాయని, అందులో రూ.15 కోట్లే ఖర్చు చేశారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో మిగిలిన రూ.45 కోట్లు వెనక్కి మళ్లాయన్నారు. వాటిని తీసుకొచ్చి మురుగు కాలువలు, సీసీ రోడ్లు, క్రీడా మైదానం, ఇతర అభివృద్ధి పనులకు వెచ్చిస్తామన్నారు.

సీఎంఆర్ ఇవ్వకుంటే చర్యలు తప్పవు

మిల్లర్లకు కలెక్టర్ రాజర్షిషా హెచ్చరిక

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో సివిల్ సప్లయికు సంబంధించిన బియ్యం ఎగవేతదారులైన మిల్లర్లపై, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జీలపై పెట్టిన ఆర్ఆర్ యాక్ట్‌కు సంబంధించిన చర్యలు సత్వరమే తీసుకోవాలని కలెక్టర్ రాజర్షిషా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో రెవెన్యూ సివిల్ సప్లయి అధికారులతో సమీక్ష, ఆపై జిల్లాలోని రైస్‌మిల్లర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ నర్సింహ రైస్ మిల్, నర్సాపూర్ శ్రీధర్ గుప్తా రైస్‌మిల్, మైసాయిపేట చైతన్య ఆగ్రో, పాపన్నపేట భవాని రైస్ మిల్, రామాయంపేట భవాని రైస్ మిల్లర్లు సీఎంఆర్‌లు ఇవ్వలేదన్నారు. వారిపై ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థిర, చర ఆస్తుల వివరాలను సేకరించి జప్తు చేయాలని ఆదేశించారు. ఎంఎల్ఎస్ పాయింట్ గోదాంల్లో బియ్యం అవకతవకలకు పాల్పడిన సిబ్బంది పైనా ఆర్ఆర్ యాక్ట్ అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

అనంతరం తెలంగాణ రాష్ట్ర జంతు సంక్షేమ సంస్థ, పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో జీవాల సంరక్షణ గోడప్రతులను అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్ఓ పద్మశ్రీ , జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ విజయ శేఖర్ రెడ్డితో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు అవగాహన కేంద్రాన్నీ ప్రారంభించారు.

కేజీబీవీ విద్యార్థినులకు అభినందన

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జేఎస్‌టీయూ హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి నాటక పోటీల్లో నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి కేజీబీవీ విద్యార్థినులు నుక్కడ్ నాటక్ ప్రదర్శన ఇచ్చారు. ఆ మేరకు గవర్నర్ తమిళిసై నుంచి ప్రథమ బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా విద్యార్థులను అభినందించారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

ప్రజావాణిలో 95 ఫిర్యాదులు

మెదక్ కలెక్టరేట్/ మున్సిపాలిటీ: ప్రజావాణిలో వినతులు వెల్లువెత్తాయి. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేశ్, డీఆర్ఓ పద్మశ్రీతో కలిసి కలెక్టర్ రాజర్షిషా నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఫిర్యాదులను స్వీకరించారు. వాటిని సత్వరం పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇందులో అత్యధికంగా భూ సమస్యలు, పెన్షన్, ఉపాధి, ల్యాండ్ సర్వే తదితర సమస్యలపై 95 ఫిర్యాదులొచ్చాయి.

జిల్లా పోలీస్ కార్యాలయంలోనూ...

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ బి.బాలస్వామి ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. అందులో హైదరాబాద్‌కు చెందిన గొప్పు వెంకట్ భాస్కర్ రావు మాసాయిపేట్ మండలం బొమ్మారం గ్రామంలో ఎకరా 35 గుంటల భూమి ఉందని, కానీ మట్టెల సాయికిరణ్ భూమిని ఆక్రమించాలనే ఉద్దేశంతో బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. ఇటీవల తన పొలం దున్నుతున్న రమేశ్‌ను అతను, మట్టెల నర్సింహులు, మట్టెల నాగరాజు కొట్టి అక్కడి నుంచి పంపించి వేశారన్నారు. ఈ విషయమై బాధితులకు న్యాయం చేయాలని చేగుంట ఎస్ఐకి ఎస్పీ సూచించారు.

క్లుప్తంగా

‘టీశాట్-నిపుణ’ లైవ్ టెలీకాన్ఫరెన్స్‌కు ఎంపిక


క్రాంతి కుమారి

ములుగు(గజ్వేల్): స్కూల్ లీడర్‌షిప్ అకాడమీ- రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో (టీశాట్-నిపుణ) చానల్ ద్వారా నిర్వహిస్తున్న లైవ్ టెలీ కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ములుగు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు ఎం.క్రాంతి కుమారి ఎంపికయ్యారు. పాఠశాలలో విద్యార్థులకు కేంద్రీకృతంగా, వినూత్న పద్ధతిలో బోధిస్తున్న ఉపాధ్యాయులు రాష్ట్రం నుంచి ముగ్గురు ఎంపిక కాగా, అందులో క్రాంతి కుమారి ఒకరు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, మండల విద్యాధికారి ఉదయ భాస్కర్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారులు అభినందించారు.

పొలంలోనే రైతు మృతి


అశోక్ మృతదేహం

గజ్వేల్‌రూరల్: పొలం వద్ద పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు రైతు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కోమటిబండలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉబ్బని అశోక్(35)కు భార్య పోచమ్మతోపాటు ఇద్దరు కొడుకులున్నారు. గ్రామ పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్న అశోక్ తనకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయ పనులు చేస్తున్నాడు. సోమవారం తన పొలంలో వరినాట్లు వేసేందుకు పొలం గట్లను సరిచేసే క్రమంలో ప్రమాదవశాత్తు బురద పొలంలో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ప్రమాదస్థలానికి చేరుకొని విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- రూ.55 వేలు, బైక్‌లు స్వాధీనం
- నలుగురు అరెస్ట్, పరారీలో ముగ్గురు

సిద్దిపేటఅర్బన్: పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేసిన ఘటన సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూరు గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు సీఐ రమేశ్ సిబ్బందితో కలిసి వెల్కటూరు గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకోగా ముగ్గురు పరారయ్యారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.55,179, మూడు బైకులు, 4 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని త్రీటౌన్ పోలీసులకు అప్పగించగా వారిపై కేసు నమోదు చేశారు. పట్టుబడిన వారిలో వెల్కటూరు గ్రామానికి చెందిన ఆలేటి కృష్ణ, రాచమల్ల కనకయ్య, దుద్దెడ గ్రామానికి చెందిన నర్ర దేశిరెడ్డి, పొన్నాలకు చెందిన లెంకల రవి ఉన్నారు. సిర్సినగండ్ల గ్రామానికి చెందిన ఆంజనేయులు, కొండపాక గ్రామానికి చెందిన యాదగిరి యాదవ్, మంతూరి మహేశ్ పరారీలో ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి నూరి కృష్ణ



మాట్లాడుతున్న జడ్జి కృష్ణ

జహీరాబాద్ టౌన్: చదువుతోపాటు విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జహీరాబాద్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ నూరి కృష్ణ అన్నారు. పట్టణంలోని బీసీ వసతి గృహంలో లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించడానికి చట్టాలు తోడ్పడుతాయన్నారు. పోక్సో చట్టం, బాలకార్మిక చట్టం, సమాచార చట్టం, జ్యువైనల్ జస్టిస్ యాక్ట్ తదితర చట్టాలపై వివరించారు. బాల కార్మికులు, బాల వివాహ బాధితులను గుర్తిస్తే తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. లేదా 1098 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సదస్సులో బార్ అసోసియేషన్ కార్యదర్శి సంతోష్‌కుమార్ సాగర్, న్యాయవాదులు బ్రహ్మానందరెడ్డి, మహేశ్, శేఖర్, జగన్, మహేందర్, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, వార్డెన్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

రోబో కనువిందు



- మనుషులకు బదులు రోబోలే వడ్డింపు
- కస్టమర్ల దగ్గరకు వెళ్లి ఆహారం అందజేత
- మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా వినూత్న ఆలోచన
- అట్రాక్ట్ అవుతున్న భోజన ప్రియులు

సిద్దిపేటలో ‘రోబో 2.0 ఫ్యామిలీ రెస్టారెంట్’

భోజనం చేయడానికి హోటల్‌కు వెళ్తే ఫుడ్ ఆర్డర్ చేసిన తర్వాత మామూలుగా అయితే మనుషులు (వెయిటర్లు) ఆహారాన్ని తీసుకొచ్చి కస్టమర్లకు వడ్డిస్తారు. కానీ ఇక్కడ రోబోలే స్వాగతం పలుకుతాయి. మనతో మాట్లాడి ఫుడ్ ఆర్డర్ తీసుకుంటాయి. ఆర్డర్ చేశాకా ఆ ఫుడ్‌ను ప్లేట్‌లో రోబోలే పట్టుకొస్తాయి. ఇది ఎక్కడో కాదు సిద్దిపేట పట్టణం కరీంనగర్ రోడ్డులో ఇటీవలె ప్రారంభమైన ‘రోబో 2.0 ఫ్యామిలీ రెస్టారెంట్’. ఈ హోటల్ యజమాని తీసుకొచ్చిన వినూత్న ఆలోచనకు భోజన ప్రియులు ఆకర్షితులవుతున్నారు.

– సిద్దిపేట కమాన్


ప్లేట్‌లో భోజనం తీసుకొస్తున్న రోబో


హోటల్‌లో కస్టమర్ల వద్దకు ఆహారాన్ని తీసుకొస్తున్న రోబోలు (మైత్రీ)

సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన రోబో 2.0 ఫ్యామిలీ రెస్టారెంట్‌లో రెండు రోబోలను హైదరాబాద్ నుంచి రూ. 6 లక్షలకు కొనుగోలు చేసి తీసుకొచ్చారు. ఈ రోబోలు చార్జింగ్ బ్యాటరీల సాయంతో పని చేస్తాయి. భోజనం చేయడానికి హోటల్‌కు వెళ్లగానే ముందుగా రోబోలు కస్టమర్లు కూర్చున్న టేబుల్ వద్దకు వెళ్లి ‘నమస్కారం సార్, మేడమ్.. రోబో 2.0 ఫ్యామిలీ రెస్టారెంట్‌కు స్వాగతం. నా పేరు మైత్రీ ఫుడ్ ఆర్డర్ చేయండి సార్ అని పలుకుతుంది. మనకు నచ్చిన భోజనం ఆర్డర్ చేసిన తర్వాత మరో రోబో ఆర్డర్ చేసిన భోజనం ప్లేట్‌లో కస్టమర్ కూర్చున్న టేబుల్ వద్దకు తీసుకొస్తుంది. వేడి వేడి ఆహారాన్ని తీసుకొచ్చాను.. ధన్యవాదాలు సార్ అని చెబుతుంది.

ఆడుకోవడానికి గేమ్స్ జోన్..

ఇలా వినూత్న పద్ధతిలో భోజనం వడ్డిస్తూ కస్టమర్లను, భోజన ప్రియులను ఆకర్షిస్తుంది ఈ రోబో 2.0 ఫ్యామిలీ రెస్టారెంట్. ఇప్పటికే సిద్దిపేటలో ట్రైన్ రెస్టారెంట్‌ను నిర్వాహకులు నడుపుతున్నారు. మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా, కస్టమర్లను ఆకర్షించే విధంగా వినూత్న పద్ధతిలో రోబోలను ఏర్పాటు చేసి వాటి సాయంతో భోజనాన్ని సరఫరా చేస్తూ హోటల్‌ను నిర్వహిస్తున్నారు. ఈ రోబో ఫ్యామిలీ రెస్టారెంట్‌లో చిన్న పిల్లలు ఆడుకోవడానికి ప్రత్యేకంగా గేమ్స్ జోన్, రాత్రి సమయంలో ప్రత్యేక లైటింగ్, హోం థియేటర్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేశారు.

వీకెండ్‌లో తాకిడి ఎక్కువ..

ఈ రెస్టారెంట్‌లో ఇతర హోటల్‌లో ఉన్న రేట్ల మాదిరిగానే సాధారణ చార్జీలు ఉంటాయని హోటల్ నిర్వాహకులు తెలిపారు. 20 రోజుల క్రితం ఓపెన్ చేసిన హోటల్‌కు కస్టమర్లు చిన్న పిల్లలు, కుటుంబ సభ్యులతో కలిసి ఎక్కువగా వస్తున్నారని, వీకెండ్‌లో కస్టమర్ల తాకిడి ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. హోటల్‌లో అన్ని రకాల చికెన్, మటన్, ఫిష్, ప్రాన్స్ బిర్యానీలు, ఇతర భోజనాలు, వెజ్, నాన్‌వెజ్ అందుబాటులో ఉన్నాయి. ఇందులోని రోబోలతో ఫొటోలు దిగడానికి, ఆ వాతావరణాన్ని ఎంజాయ్ చేయడానికి కస్టమర్లు హోటల్‌కు క్యూ కడుతున్నారు.

పిల్లలు ఎంజాయ్ చేస్తున్నారు



సిద్దిపేటలో రోబో ఫ్యామిలీ రెస్టారెంట్ ఓపెన్ చేశారని తెలిసి కుటుంబంతో కలిసి భోజనం చేయడానికి వచ్చాం. ఫుడ్ ఆర్డర్ చేస్తే రోబోలు భోజనం తీసుకురావడం, అవి మాట్లాడడం డిఫరెంట్‌గా ఉంది. పిల్లలు రోబోలతో ఫొటోలు దిగడానికి ఆసక్తి చూపుతూ ఎంజాయ్ చేస్తున్నారు. ఇక్కడి రావడం సంతోషంగా ఉంది.

– మేఘన, గృహిణి, సిద్దిపేట

వినూత్న ఆలోచనతో..



మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా హోటల్‌లో రోబోలను ఏర్పాటు చేశాం. వాటితో భోజనం సప్లయ్ చేయిస్తున్నాం. రూ.6 లక్షల విలువ గల రెండు రోబోలను పెట్టి వాటి సాయంతో కస్టమర్లకు వేడి వేడి ఆహారాన్ని అందిస్తున్నాం. చార్జింగ్ బ్యాటరీల సాయంతో రోబోలు పని చేస్తాయి. హోటల్‌లో పనిచేసే వారు వీటిని ఆపరేట్ చేస్తారు.

– సతీష్, రెస్టారెంట్ నిర్వాహకులు

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు సీఈఐఆర్‌తో గుర్తింపు

30 మంది బాధితులకు అప్పగించిన సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: కొన్ని రోజులుగా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) యాప్ ద్వారా గుర్తించి పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ అనురాధ సోమవారం బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. కమిషనరేట్ పరిధిలోని పలువురు కొన్ని రోజులుగా తమ సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నట్లు సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. సిబ్బంది సెల్‌ఫోన్ వివరాలు నూతనంగా తీసుకొచ్చిన సీఈఐఆర్ యాప్‌లో నమోదు చేసి, బ్లాక్ చేశారు. ఈ యాప్ ద్వారా సెల్‌ఫోన్‌లను గుర్తించి 30 మంది బాధితులకు తిరిగి అప్పగించారు. జిల్లాలో 2023 ఏప్రిల్ 20 నుంచి ఇప్పటివరకు 2,001 మంది సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్నట్లు సీఈఐఆర్ యాప్‌లో నమోదు చేసుకున్నట్లు తెలిపారు. 612 మంది సెల్‌ఫోన్లు ట్రేస్ చేసి 330 మంది బాధితులకు ఫోన్లు అప్పగించినట్లు పేర్కొన్నారు. మిగితా ఫోన్‌లు కూడా త్వరలో ట్రేస్ ఔట్ చేస్తామన్నారు. సెల్‌ఫోన్ పోతే వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్‌లో లేదా సీఈఐఆర్ యాప్‌లో ఫోన్ వివరాలు నమోదు చేయాలన్నారు. దీని ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను త్వరగా గుర్తించవచ్చు అన్నారు. ఈ యాప్ గురించి పోలీస్ స్టేషన్, సర్కిల్, డివిజన్ పరిధిలో బ్లూ కోర్ట్స్, పెట్రో కార్ సిబ్బందితో అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ మల్లారెడ్డి, వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి, ఐటీ కోర్ సిబ్బంది శ్రీకాంత్, స్వప్న, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.


ఫోన్లు అందజేసిన అనంతరం బాధితులతో సీపీ అనురాధ

‘కుష్టు’ నయం చేయొచ్చు


అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు సురేష్‌బాబు, మోహన్‌లాల్

- వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపొద్దు
- సిద్దిపేట ప్రభుత్వాస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ సురేశ్‌బాబు

సిద్దిపేటకమాన్: కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపొద్దని సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్ బాబు, డెర్మటాలజీ విభాగ హెచ్‌ఓడీ డాక్టర్ బి.మోహన్‌లాల్ అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆస్పత్రిలో డెర్మటాలజీ విభాగ వైద్యులు సోమవారం యాంటీ లెప్రసీ అవేర్‌నెస్ కార్యక్రమం (కుష్టు వ్యాధి నిర్మూలన) నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎవరికైనా చర్మంపైన స్పర్శలేని మచ్చలు ఉంటే వారికి సంబంధిత ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య చికిత్స అందిస్తామన్నారు. వారిపై వివక్ష చూపకుండా అవసరమైన వైద్య చికిత్స అందించేలా చూస్తామని ప్రజలతో వైద్యులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేయించారు. కుష్టు వ్యాధిగ్రస్తులు ఎక్కువగా లేరని, అక్కడక్కడ కొన్ని కేసులు మాత్రమే ఉన్నాయన్నారు. మొదట్లోనే గుర్తించి వైద్యం తీసుకోవడం ద్వారా కుష్టు వ్యాధి పూర్తిగా నయం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓలు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ హేమలత, డాక్టర్ సదానందం, డెర్మటాలజీ విభాగ వైద్యులు డాక్టర్ సుధీర్, డాక్టర్ సరిత, డాక్టర్ హారిక, డాక్టర్ సౌజన్య, డాక్టర్ జుహి, మెడికల్ కళాశాల విద్యార్థులు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సభలను విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11, 12 తేదీల్లో ఖమ్మంలో జరిగే విద్యా వైజ్ఞానిక మహా సభలకు ఉపాధ్యాయులు మేధావులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శులు ఆర్.మల్లేశం, జి. శివాజీ పిలుపునిచ్చారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రోగ్రెసీవ్ టీచర్స్ ఫెడరేషన్ ద్వితీయ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభల పోస్టర్లను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌తో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ‘అంతరాలు లేని విద్య ప్రజల హక్కు ప్రభుత్వ బాధ్యత ’ ప్రధాన అంశంగా సభలో చర్చిస్తామన్నారు. అసమాన సమాజంలో సమానత్వ విద్య, మహిళల స్థితిగతులు, కర్తవ్యాలు, ప్రభుత్వ విధానాలు, ఆర్థిక సంక్షోభం అంశాలపై ప్రొ.హరగోపాల్, ప్రొ. సీ.కాశీం, బుర్ర రమేశ్, నర్సింహారెడ్డి, చందన చక్రవర్తి, ఎస్.వేణుగోపాల్ ప్రసంగిస్తారని తెలిపారు. ముఖ్య అతిథులుగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు హాజరు కానున్నట్లు పే ర్కొన్నారు. కార్యక్రమంలో భూంపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ రాజేందర్, టీపీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్లు రామచంద్రం, నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి సతీశ్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రవి శంకర్, దయాసాగర్, వినయ్ కుమార్, టీచర్లు భాగ్యమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

పార్ట్ టైం ఉద్యోగం పేరిట మోసం

రూ.1,33,000 పోగొట్టుకున్న బాధితుడు

సిద్దిపేటకమాన్: పార్ట్ టైం ఉద్యోగం పేరిట వచ్చిన మెసేజ్‌ను నమ్మి ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో డబ్బులు పోగొట్టుకున్న ఘటన కమిషనరేట్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం సీపీ అనురాధ తెలిపిన వివరాల ప్రకారం.. అక్కన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి పార్ట్ టైం జాబ్ పేరిట వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి అందులో జాయిన్ అవ్వమని ఓ లింకును పంపాడు. అది నమ్మిన బాధితుడు లింక్ ద్వారా గ్రూప్‌లో జాయిన్ అయ్యాడు. హోటల్‌లో పార్ట్ టైం ఉద్యోగం పేరిట ఫైవ్ స్టార్ రేటింగ్ వస్తే డబ్బులు వస్తాయని నమ్మించాడు. ఆ మాటలు నమ్మి మొదట కొంత పెట్టుబడి పెట్టగా లాభాలు వచ్చాయి. దీంతో బాధితుడు పలు విడతలుగా మొత్తం రూ.1,33,000 ఆన్‌లైన్‌లో పంపించాడు. తర్వాత ఆ వాట్సాప్ గ్రూప్ బ్లాక్ చేసి ఉండడంతో సైబర్ మోసం జరిగినట్లు గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. బాధితుడు పంపిన ఖాతాలో ఉన్న రూ.45 వేలు ఫ్రీజ్ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులకు వ్యక్తిగత, బ్యాంక్, ఓటీపీ వివరాలు పంపకూడదని, డబ్బులు పంపకూడదని సీపీ సూచించారు.

కరాటే పోటీల్లో సత్తా


మిరుదొడ్డి(దుబ్బాక): సర్టిఫికెట్లతో విద్యార్థులు


రామాయంపేట(మెదక్): మెడల్స్‌తో విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): అంతర్జాతీయ కరాటే పోటీల్లో మిరుదొడ్డి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు సత్తా చాటారని యువ స్పోర్ట్స్ అకాడమీ తెలంగాణ వ్యవస్థాపకుడు మాస్టర్ బురానీ శ్రీకాంత్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వర్ణలత తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ.. వరల్డ్ నకయమా షోటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో రెండవ అంతర్జాతీయ స్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో మిరుదొడ్డి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు 17 మంది పాల్గొన్నట్లు పేర్కొన్నారు. హరిణి, భవాని, హరిత, హశ్విత, కావ్య పోటీల్లో పాల్గొని 8 గోల్డ్ మెడల్స్‌ను, శ్రావణి, ప్రత్యూష, అక్షయ, ప్రసన్న లక్ష్మి, సంజన, రవళి, దీక్షిత, ఆకాంక్ష, రమ్య, దివ్యలు 9 సిల్వర్ మెడల్స్‌తోపాటు ప్రశంసా పత్రాలను అందుకున్నారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, జీఈసీఓ ముక్తేశ్వరి, పీఈటీ భాగ్యమ్మలు అభినందించారు.

రామాయంపేట(మెదక్): జాతీయ కరాటే పోటీల్లో రామాయంపేట కస్తూర్బా విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. పాఠశాల తరపున మొత్తం 18 మంది పోటీలో పాల్గొనగా, తొమ్మిది మంది గోల్డ్ మెడల్ సాధించినట్లు గ్రాండ్ మాస్టర్ రొయ్యల హరిప్రసాద్ తెలిపారు. వీరితోపాటు ఆరుగురు ద్వితీయ, ముగ్గురు తృతీయ బహుమతులు సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థినులను పాఠశాల ప్రత్యేక అధికారిణి అనురాధ, ఉపాధ్యాయులు అభినందించారు.

సిద్దిపేటజోన్: అంతర్జాతీయ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో సిద్దిపేట చిన్నారులు ప్రతిభ కనబర్చారు. కటాస్ విభాగంలో అభినయ్, వినూత్న, రాము, శ్రీయాన్స్, అభిరామ్, అద్వైత మొదటి స్థానంలో, మనీష్, గౌతమ్, యశ్వంత్, తేజ్ ద్వితీయ స్థానంలో నిలిచారు. ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ హీరో సుమన్ హాజరై బహుమతులు అందజేశారు.

కొల్చారం(నర్సాపూర్): కరాటే పోటీల్లో మండలానికి చెందిన విద్యార్థులు పలు విభాగాల్లో పతకాలు సాధించినట్లు రెంజుకి షోటో ఖాన్ కరాటే వ్యవస్థాపక మాస్టర్ నగేశ్ సోమవారం తెలిపారు. కటాఫ్ విభాగంలో అక్షయ, సీనియర్ కటాఫ్ విభాగంలో శిరీష గోల్డ్ మెడల్ సాధించారన్నారు. అండర్ 18, 19 విభాగాల్లో శివాజీ, సుధాకర్ గోల్డ్ మెడల్ సాధించారన్నారు. జూనియర్ విభాగాల్లో వైష్ణవి, నాగరాజు, లక్ష్మణ్, శిరీష సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. వీరికి మండలానికి చెందిన ట్రైనర్ మల్లేశం ప్రత్యేక అభినందనలు తెలిపారు.

గోవా మద్యం స్వాధీనం


మద్యాన్ని చూపుతున్న అధికారులు

మునిపల్లి(అందోల్): గోవా నుంచి మద్యం తీసుకొస్తున్న కారును మెదక్ డివిజన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కంకోల్ గ్రామ శివారు 65వ నంబర్ జాతీయ రహదారి టోల్ ప్లాజా సమీపంలో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా గోవా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా కారులో 42 మద్యం బాటిళ్లను తరలిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐలు మోహన్ కుమార్, రమేశ్ రెడ్డి, రజిత, తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐలు విశ్వనాథ్, అనీల్ కుమార్, సిబ్బంది అలీమ్, ఆజామ్, గోపాల్, సతీశ్, మల్కయ్య, రామారావు, కరీం పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ స్కూటీలో మంటలు

జోగిపేట (అందోల్): ఎలక్ట్రిక్ స్కూటీలో మంటలు చెలరేగిన ఘటన జోగిపేట ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట చోటు చేసుకుంది. దీంతో చుట్టుపక్కల వారు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని డాకూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ సోమవారం స్కూటీపై జోగిపేట ఎస్‌బీఐ బ్యాంక్‌కు పని నిమిత్తం వచ్చి స్కూటీని బ్యాంక్ ఎదుటే పార్కు చేసి లోపలికి వెళ్లాడు. కొద్దిసేపటికి స్కూటీలోని బ్యాటరీ నుంచి పొగలు రావడం చుట్టుపక్కల వారు గమనించారు. వెంటనే జోగిపేట ఫైర్ స్టేషన్, పోలీస్ స్టేషన్‌లకు సమాచారం అందించారు. పక్కనే బైక్ మెకానిక్ ఉండడంతో స్కూటీలోని బ్యాటరీని తీసి పక్కనే ఉన్న మురికి కాల్వలో పడేశాడు. బైక్ పాయింట్‌లోని వాటర్‌తో మంటలను ఆర్పివేశారు. బ్యాటరీ స్కూటీలోనే ఉంటే పెద్ద శబ్దంతో పేలి ఉండేదని పోలీసులు తెలిపారు.


డెయిరీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

- కల్తీ పాలని బిల్లులు నిలిపివేత
- విజయ డెయిరీ ఎదుట దూల్మిట్ట రైతుల ధర్నా


డెయిరీ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

చేర్యాల(సిద్దిపేట): విజయ డెయిరీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని నిరసిస్తూ పాలశీతలికరణ కేంద్రం ఎదుట దూల్మిట్ట మండల పాడి రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలాంటి అనుభవం లేని మేనేజర్, సిబ్బందిని నియమించి రైతులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. పాలను సిద్దిపేట ల్యాబ్‌లో టెస్ట్ చేస్తే నెగిటివ్ వస్తుందని అదే పాలను చేర్యాలలో చేస్తే పాజిటివ్ వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాంట్ ఆపరేటర్‌ని డెయిరీ మేనేజర్‌గా నియమించి పాడి రైతులకు అన్యాయం చేశారని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఎలాంటి కల్తీ చేయకుండా పాలను కేంద్రానికి తీసుకొస్తే పాలల్లో ఉప్పు, చెక్కర వస్తుందని రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. రైతులకు రెండు నెలల నుంచి బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం పై డీడీ గోపాల్ సింగ్ రైతులతో ఫోన్ మాట్లాడి నేటి నుంచి పాలను కొనుగోలు చేస్తామని, పాల బిల్లు త్వరలోనే రైతులకు అందిస్తామని తెలపడంతో ధర్నాను విరమించారు. ధర్నాకు సీపీఎం మండల కార్యదర్శి కొంగరి వెంకట్, నాయకులు సంఘీభావం తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


గోపాల్(ఫైల్)

వట్‌పల్లి(అందోల్): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన అందోల్ మండల పరిధిలోని డాకూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. జోగిపేట ఎస్ఐ-2 మొగులయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పుల్కల్ మండలంలోని మిన్పూర్ గ్రామానికి చెందిన చెప్యాల గోపాల్(38) అప్పులు చేసి ట్రాక్టర్, వరికోత మిషన్ యంత్రాలతో పాటు ఓ కారును కొనుగోలు చేశాడు. అప్పుల భారం రోజు రోజుకూ పెరగడంతో కొంత భూమిని అమ్మినా తీరలేదు. దీంతో మనస్తాపానికి గురై ఆదివారం ఉద యం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం ఉదయం నాందేడ్ అకోలా 161 జాతీయ రహదారి పక్కన ఓ చెట్టుకు చీరతో ఉరి వేసుకున్నట్లు కనిపించాడు. గోపాల్ మృతి చెందిన విషయం తెలుసుకున్న కుటుంబీకులు, బంధువులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని బోరున విలపించారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతుడి భార్య మానస ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..


రామకృష్ణ మృతదేహం

పటాన్‌చెరుటౌన్: వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ రవీందర్ కథనం ప్రకారం.. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా కళింగగూడెంకు చెందిన పూజారి రామకృష్ణ(35) బతుకుదెరువు కోసం పదేళ్ల కిందట పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు వచ్చాడు. డీఎస్ కాలనీలో ఉంటూ పాశమైలారం పారిశ్రామిక వాడలోని యూజియా ఫార్మా క్యాంటీన్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నా డు. ఆర్థిక ఇబ్బందులతోపాటు మద్యానికి బానిసైన రామకృష్ణ ఇంటికి వెళ్లకుండా, పని చేసే క్యాంటీన్ వద్దే ఉంటున్నాడు. సోమవారం ఉదయం క్యాంటీన్ స్టోర్ రూమ్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.